క్లుప్తంగా...

నేడు కోకాపేటలో ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా మంగళవారం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలో ప్రెస్టేజ్ గ్రూప్ వారు రూ.2కోట్లతో నిర్మించిన పాఠశాల భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని కౌన్సిలర్ జి.శివారెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ఉంటుందని, కౌన్సిలర్‌లు, అధికారులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కట్ట మైసమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహి స్తున్నామన్నారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి విశేష ద్రవ్యాభిషేకం, వేద స్వస్తి గవ్యాంత పూజలు మార్జనలు, మంత్రపుష్ప నిరాజనములు, ఉదయం గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచ గవ్య స్థాపన, మండపారాధణ, ఉదయం 9.30 గంటలకు అగ్నిమతణ అగ్ని ప్రతిష్టాపన హోమం , పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు దశల వారిగా పరిష్కరిస్తున్నామని కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. సోమవారం 13వ డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆయన డీఈ యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కాలనీలు, బస్తీల్లో రోజూ అధికారులతో ప్రత్యేక పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

శంషాబాద్ మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ లక్ష్మీబాయి (ఫైల్)

శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ పి. సంజయ్‌యాదవ్ తల్లి శంషాబాద్ మాజీ సర్పంచ్‌గా పనిచేసిన పి. లక్ష్మీబాయి ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆమె స్వగృహంలో కన్నుమూశారు. 2001–2006 వరకు శంషాబాద్ మేజర్ గ్రామపంచాయతీగా సర్పంచ్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు, స్థానికులు ఆమెకు నివాళులర్పించారు.

బొటానికల్ గార్డెన్ వద్ద అత్యాధునిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి



బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్ వద్ద పాదచారుల కోసం ఎస్కలేటర్‌తో కూడిన అత్యాధునిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి బొటానికల్ గార్డెన్స్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఔషధ, పండ్ల జాతుల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. మానవాళి మనుగడకు మొక్కే శ్రీరాయ రక్ష అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బొటానికల్ గార్డెన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణలో అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొనడం గర్వకారణమన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తొమ్మిదేళ్లలో గరిష్ట స్థాయిలో 273 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కలను సంరక్షించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హరితహారంపై సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బొటానికల్ గార్డెన్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1500 ఎకరాల్లో యూకలిప్టస్ చెట్లను తొలగించి చందనం, టేకు మొక్కలు నాటినట్లు వివరించారు. టీఎస్ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ ఎంజె అక్బర్, కార్పొరేటర్ హమీద్ పటేల్, టీఎస్ఎఫ్‌డీసీ ఏడీ స్కైలాబ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణే లక్ష్యం కావాలి

- ఉత్సాహంగా హరితహారం..
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో హరిత హారం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మొక్కల మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



నెక్నాంపూర్ చెరువు వద్ద మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

మణికొండ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన తెలంగాణ హరితోత్సవం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నెక్నాంపూర్ చెరువు సమీపంలో చైర్మెన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్‌చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్‌లు కౌన్సిలర్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మొక్కలను పెంచాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. మణికొండ మేనేజర్ బీఎన్‌కే రమేష్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, రిటైర్డ్ డీఎఫ్ఓ యాజస్‌అహ్మద్, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాళోజీ పార్కులో బోర్ వేసే పనులు, నెక్నాంపూర్ నిమజ్జన సాగర్ వద్ద రెయిలింగ్‌ను ప్రారంభోత్సవం చేశారు.

విద్యుత్ కార్యాలయంలో...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. డీఈ శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వీలైనన్ని మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి రాజు, ఏడీఈ సాయినాథ్, సహాయ ఇంజనీరు (టెక్నికల్) మానస, సబ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో...

అత్తాపూర్: ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీ పార్కులో సోమవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కార్పొరేటర్ మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ఇప్పటి నుంచే మొక్కలను నాటాలని సూచించారు. లక్ష్మినగర్ కాలనీ వాసులు సీతారామస్వామి, ఎం.మూర్తి, ఎం.ప్రభాకర్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా బాధ్యతాయుతంగా మెలగాలి

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహార కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని మొక్కలను నాటాలని రాష్ట్ర ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీ జితేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ రాజా రామ్ బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడామీలో సోమవారం హరితహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీ జితేందర్ హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా బాధ్యతాయుతంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహార కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో అకాడామీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ..



నార్సింగి విద్యుత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న డీఈ శివశంకర్

ఉద్యానవన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో సోమవారం హరితహార ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అసోసియేట్ ప్రొఫెసర్స్ కలిసి వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను క్యాంపస్ ఆవరణంలో నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్రతి విద్యార్థి తమ పుట్టిన రోజు సందర్భంగా 5 మొక్కలు నాటాలని వాటి సంరక్షణ భాధ్యతలు వారే తీసుకోవాలని సూచించారు.

మొక్కలు పెంచితేనే భవిష్యత్తు..

శంషాబాద్: మొక్కలు పెంచితేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని తొండుపల్లిలో సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున చెట్లు నాటారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, కౌన్సిలర్ పి. రాణి పాల్గొన్నారు.



లక్ష్మినగర్ కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ



పోలీస్ అకాడామీలో మొక్కలు నాటుతున్న రాష్ట్ర ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీ జితేందర్



శ్రీ కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లిలో భారీగా డ్రగ్స్ పట్టివేత



వివరాలు తెలుపుతున్న డీసీపీ

ఇద్దరి అరెస్టు

రాజేంద్రనగర్: జిమ్‌లలో వ్యాయామం చేసే యువకులను టార్గెట్‌గా చేసుకొని 'మేఫే టెర్మిన్ సల్ఫేట్' డ్రగ్స్‌ను విక్రయిస్తున్న రెండు ముఠాలను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో సోమవారం వివరాలను డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ధూల్‌పేట్ మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన నితీష్ జిమ్ కోచ్‌గా పనిచేస్తూ..తనకు వద్దకు వచ్చే యువకులకు కండలు పెంచేందుకు ఉపకరిస్తుందని మేఫే టెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్ తీసుకోవాలని సూచిస్తున్నాడు. ఈ మేరకు అతడే ఒన్ ఎంఎల్ ఇంజెక్షన్‌ను రూ.800–1500 వరకు విక్రయిస్తున్నాడు. ఢిల్లీలో రూ.300 దొరికే ఇంజెక్షన్‌ను కొరియర్ ద్వారా తెప్పించి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. గతంలో నితీష్ 2009లో నారాయణగూడ, 2022లో ఆసిఫ్‌నగర్‌లోనూ వీటిని విక్రయించి పోలీసులకు పట్టుబడ్డాడు. జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా తీరు మార్చుకోలేదు. ఆదివారం సాయంత్రం దుర్గానగర్ చౌరస్తా వద్ద ఇంజెక్షన్లు విక్రయించేందుకు రాగా సమాచారం అందుకున్న ఎస్ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. మేఫే టెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్(గ్రీన్)126, వాటర్ యాంపుల్స్–50, 1ఎంఎల్ ఇంజెక్షన్లు 100, స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లు

వట్టెపల్లి రైల్వే ట్రాక్ వద్ద...

వట్టెపల్లి రైల్వే ట్రాక్ వద్ద బార్కస్ ప్రాంతానికి చెందిన సోహెల్ సహేదిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతడి వద్ద మేఫే టెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్ (పింక్)–61, మేఫే టెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్ గ్రీన్–101లను స్వాధీనం చేసుకున్నారు. సోహెల్‌కు స్నేహితుడైన అహ్మద్ ఖురేషి ఇంజెక్షన్లు ఇచ్చి వట్టెపల్లి ప్రాంతంలో డెలివరీ ఇవ్వాలని సూచించడంతో వచ్చి పోలీసులకు పట్టుబడ్డాడు. అహ్మద్ ఖురేషి సైతం ఢిల్లీ నుంచి ఈ ఇంజెక్షన్లు తెప్పించుకుని విక్రయిస్తున్నాడు. రెండు కేసుల్లో నిందితులను సోమవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

రాయదుర్గం: చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారికి గుర్తింపు ఉంటుందని ఐడీఎస్ఈ డైరెక్టర్ చీఫ్ ఇంజినీర్ రబీంద్రనాథ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో కొత్తగా నియామకమైన మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అధికారులకు 20 రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి అధికారి, ఉద్యోగికి అవగాహన అవసరమన్నారు. కొత్తగా నియామకమైన వారికి ప్రత్యేకంగా వీటిపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ 20 రోజుల పాటు సాగే శిక్షణలో పర్యావరణ పరిరక్షణ, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంపై తరగతి సెషన్లు, అసైన్‌మెంట్లు, శిక్షణ, గ్రూపు కార్యక్రమాలు, ప్రాతినిధ్యం వహించడం, టెక్నికల్ సైట్ విజిట్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐఈఐ మాజీ అధ్యక్షుడు వీబీసింగ్, ఎస్కీ అధికారులు, మిలటరీ అధికారులు పాల్గొన్నారు.

'మనూ'-ఎస్‌సీడీఎస్ మధ్య అవగాహన ఒప్పందం

రాయదుర్గం: ఫ్యాషన్ టెక్నాలజీ ఇంటీరియర్ డిజైనింగ్‌లో నైపుణ్యాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌లోని సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్)తో ఉర్దూ విశ్వవిద్యాలయం ఈ అవగాహన ఒప్పందాన్ని చేసుకుంది. సోమవారం ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ఐనుల్ హసన్ సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఎస్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షురాలు సమనా హుస్సేని ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఈపీ–2020కి అనుగుణంగా ఇంటర్ డిసిప్లినరీ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అందించేందుకు, మరింతగా నైపుణ్యాలను అందించేందుకు ఒప్పందం చేసుకున్నామ న్నారు. ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సును, రెండేళ్ల డిప్లొమో కోర్సు కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్, ప్రొఫెసర్ సయ్యద్ నజ్ముల్ హసన్, ప్రొఫెసర్ ఫారూఖీ, ఎస్‌సీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

'తెలంగాణ దశాబ్ది పార్కులు' ప్రారంభం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండు 'తెలంగాణ దశాబ్ది పార్కుల'ను సోమవారం ప్రారంభించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని లక్ష్మీఎన్‌క్లేవ్, టీఎన్‌జీఓకాలనీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ దశాబ్ది పార్కులను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో యూబీడీ మేనేజర్ యూసుఫ్, సూపర్‌వైజర్ గోపాల్, నాయకులు హన్మంతునాయక్, తిరుపతి, శివాసింగ్, హరీష్‌శంకర్‌యాదవ్, దారుగుపల్లిఅనీల్, ప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, రాజు, ప్రసాద్, నర్సింగ్‌నాయక్, రంగస్వామి, రమేష్, చిన్న సుకుమార్, విశ్వనాథ్, యాదగిరి టీఎన్‌జీఓకాలనీ, లక్ష్మి ఎన్‌క్లేవ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వ్యతిరేక శక్తులు ఏకమవ్వాలి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ వ్యతిరేక రాజకీయ శక్తుల పునరేకీకరణ మొదలైందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సోమవారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఆత్మగౌరవంతో బతకాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. హామీలు మర్చిపోవడం కేసీఆర్‌కు అలవాటని..ఇందుకు ఆయనకు సెలవిచ్చి ఫాంహౌజ్‌కు పరిమితం చేయాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరదామని నాయకులకు సూచించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పెద్దగోల్కొండ సర్పంచు కె.లక్ష్మయ్య, పెద్దషాపూర్‌కు చెందిన యువ నాయకుడు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు ఆనంద్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రేవంత్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు పరమేష్, బొబ్బిలి శేఖర్, కృష్ణారెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పెద్దగోల్కొండ సర్పంచ్ లక్ష్మయ్య

ఘనంగా బుద్వేల్ వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



వీరభద్ర స్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని వీరభద్ర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. మహాకాళీ సమేత వీరభద్రస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బలిపీఠ ప్రతిష్టను చేపట్టారు. ఉదయం 8.30 గంటలకు మహా గణపతి పూజ పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసనం, కంకణధారణం ఉదయం 9 గంటలకు విశేషంగా కుంభాభిషేకాలు, పంచామృత, విశేషద్రవ్య అభిషేకాలు, ఉదయం 10 గంటలకు యజ్ఞం గణపతి హోమం, నవగ్రహ హోమం, లక్ష్మిగుబేర హోమం, వీరభద్ర హోమ, రుద్రహోమం, దుర్గా, మహాకాళీ హోమం, సరస్వతీ హోమం, ఉత్సర హోమాలు, ఒంటి గంటకు మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారికి నైవేద్యంగా బోనాలను సమర్పించారు. రేవల్లి రాజుశర్మ పంతులు మంత్రోచరణల మధ్య పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ పూజల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీలతసురేష్‌గౌడ్

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం డ్రెస్, షూ, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలకు గాను వారికి ఎప్పటికప్పుడు తమవంతు సహాయ సహకాలు అందిస్తామన్నారు.

7వ డివిజన్‌లో...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ పద్మావతిపాపయ్యాయాదవ్ ఆధ్వర్యంలో కిట్లు, పాదరక్షలు,హ్యాండ్ గ్లోవ్స్‌లు తదితర వాటిని పంపిణీ చేశారు.

దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలి

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ జగన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఆషాఢమాసం సందర్భంగా ప్రతి సంవత్సరం బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఇందుకుగాను దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని కోరామన్నారు. చాలా చోట్ల దేవాలయాల వద్ద గుంతలు గుంతలుగా మారాయన్నారు. దీంతో భక్తులకు అనేక ఇబ్బందులు కలుగుతాయన్నారు. దేవాలయాలకు లైట్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఉపకమీషనర్‌ను కోరామన్నారు. జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, జోగి రవి, డివిజన్ అధ్యక్షులు గుంజ బాబురావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ పాల్గొన్నారు.



సర్కిల్ ఉపకమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

స్టేటస్ చూసి చోరీకి వచ్చారు...




పోలీసుల అదుపులో నిందితులు శంకర్, వేద ప్రకాష్

అత్తాపూర్: దొంగతనానికి పాల్పడేందుకు వచ్చిన నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన మేరకు.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ఎస్.జనార్ధన్ రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. స్నేహితులతో కలిసి ఇటీవల విహార యాత్ర కోసం గోవాకు వెళ్లి ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో శివరాంపల్లిలో ఉన్న నివాసానికి చేరుకున్నాడు. జనార్ధన్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేసిన శివరాంపల్లి చంద్రిక కాలనీకి చెందిన శంకర్(42) జనార్ధన్‌రెడ్డి స్టేటస్ చూసి గోవాకు వెళ్లిన విషయాన్ని గమనించి మీర్‌పేట్ సాయినగర్‌కు చెందిన వేద ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరిని కలుపుకొని అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. జనార్ధన్‌రెడ్డి ఇంటి సమీపంలో తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో కారును పార్కు చేసుకొని గేటు పగులగొట్టే ప్రయత్నం చేస్తూ ఇద్దరు లోనికి ప్రవేశించారు. విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన కుటుంబ, సభ్యులు స్థానికులు, పోలీసుల సహకారంతో పట్టుకొని పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేసిన శంకర్ అతడి కుటుంబ అవసరాల కోసం పిల్లల చదువు కోసం పలుమార్లు డబ్బులు తీసుకున్న విషయాన్ని జనార్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

సీఎం దృష్టికి హోంగార్డుల సమస్యలు

- చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి హామీ
- ఎంపీని కలిసిన సైబరాబాద్ హోంగార్డుల ప్రతినిధులు

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సైబరాబాద్ హోంగార్డుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను వివరించి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మన్మథరావు, కుమార్‌కాజా పాల్గొన్నారు.